# కొనసాగుతున్న పవర్‌లూమ్, వార్పిన్, వైపని సమ్మె

- మూడో రోజుకు చేరిన సమ్మె
- కూలీ పెంచి ఒప్పందం చేసే వరకు సమ్మె కొనసాగుతుంది
- సీఐటీయూ పవర్‌లూమ్‌వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కోడం రమణ



**ప్రజానావ, సిరిసిల్ల :** పాలిస్టర్ వంచడానికి కూలి పెంచాలని గత మూడు రోజుల నుండి చేస్తున్నప్పటికీ యజమానులు చర్చల పేరుతో కాలయాపన చేస్తున్నారని సిఐటియు పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కోడం రమణ ఆరోపించారు. పాలిస్టర్ వస్త్రానికి పవర్లూమ్ కార్మికులకు, వార్పిన్, వైపని కార్మికులకు కూలి పెంచాలని ఏప్రిల్ 27 సోమవారం రోజు నుండి చేస్తున్న సమ్మె బుధవారం మూడవ రోజుకు చేరుకుంది. ఈ సమ్మెలో భాగంగా చేనేత జౌళి శాఖ కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. యజమానులు కూలి పెంచి ఒప్పందం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని చేనేత జౌళి శాఖ ఏడి కి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కోడం రమణ మాట్లాడుతూ కార్మిక శాఖ అధికారులు, చేనేత జౌళి శాఖ అధికారుల సమక్షంలో కార్మికులు సమ్మెకు వెళ్లకుండానే కూల్ పెంచి ఒప్పందం చేస్తామని చెప్పి ఇప్పుడు కూలి పెంచడం లేదని, వెంటనే యజమానులు కూలి పెంచే విధంగా చర్యలు తీసుకొని ఒప్పందం చేసి సమ్మె విరమింపజేయాలని లేనిపక్షంలో సమ్మెను ఉధృతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు అన్నల్దాస్ గణేష్, వార్పిన్ వర్కర్స్ యూనియన్ నాయకులు సిరిమల్ల సత్యం, ఉడత రవి, వైపని వర్కర్స్ యూనియన్ నాయకులు కుమ్మరి కుంట కిషన్, ఎక్కల్ దేవి జగదీష్, పవర్లూమ్ వర్కర్స్ యూనియన్ నాయకులు సబ్బని చంద్రకాంత్, భాస శ్రీధర్, గడ్డం రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## అన్నపూర్ణ రిజర్వాయర్ సందర్శన

### అనంతగిరి పోచమ్మ ఆలయంలో కలెక్టర్, ఎస్పీ పూజలు

**ప్రజానావ, సిరిసిల్ల :** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామ శివారులోని అన్నపూర్ణ రిజర్వాయర్ ను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే బుధవారం సందర్శించారు. రిజర్వాయర్ సామర్థ్యం, నీటి నిల్వ, తదితర వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అంతకముందు అనంతగిరి పోచమ్మ దేవాలయాన్ని కలెక్టర్, ఎస్పీ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ చరిత్ర, ప్రాముఖ్యత, వివరాలను ఆలయ అధికారులను జిల్లా కలెక్టర్, ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ సమర్థవంతంగా నిర్వహించాలని, పంచాయతీ సిబ్బంది పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టేలా పర్యవేక్షణ చేయాలని పంచాయతీ కార్యదర్శికి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు.



## మద్దూరులో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

**ప్రజానావ, మద్దూర్:** నారాయణపేట జిల్లా మద్దూర్ మున్సిపాలిటీ పరిధిలో మెప్మా ధాన్యాల కొనుగోలు కేంద్రాన్ని చంద్రకళ (ఆర్‌పి)కి అప్పగించడం జరిగింది. కేంద్రాన్ని బుధవారం మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సి పల్ కౌన్సిల్ చైర్‌పర్సన్ ధిల్లిఖార్ సరస్వతి జనార్దన్, ఎఎంసి చైర్మన్ ముద్దీ భీములు, కౌన్సిల్ సభ్యులు గడ్డమీది గోవింద్, గోపాల్, దినేష్, నర్సింహులు, మౌలానా, సంజీవులు, శంకర్ రెడ్డి, రమేష్, శ్యా మప్ప, రియాజ్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రైతులకు సౌకర్యవంతంగా ధాన్యాల కొనుగోలు జరిగేలా ఏర్పాట్లు చేశారన్నారు.



## పదిలో శ్రీచైతన్య పాఠశాల ప్రభంజనం

**ప్రజానావ, కరీంనగర్:** పదవ తరగతి ఫలితాలలో నగరంలోని శ్రీ చైతన్య ఉన్నత పాఠశాల బోయవాడ బ్రాంచ్ కు చెందిన విద్యార్థుల ప్రభంజనం స-ష్టించారు. 600 మార్కులకు గాను ఇద్దరు విద్యార్థులు ఈగం నాగరాణి, పంజాల వర్షిత్ 583 మార్కులు సాధించగా పాఠశాలలో వందశాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ పద్మజా హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం రాజు, కోఆర్డినేటర్ ప్రవీణ్, డీన్ విజయకృష్ణ పాల్గొన్నారు.



## సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే ఆదర్శంగా రాష్ట్ర సర్కార్

### నూతన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు

**ప్రజానావ, సిరిసిల్ల :** సిరిసిల్ల పట్టణ పరిధిలోని చంద్రంపేట 12వ వార్డులో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల బ్లాక్ అద్యక్షులు సూర దేవరాజు నిర్మల ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఇరు కుటుంబాల దంపతులకు నూతన వస్త్రాలను బహుకరించారు. ఈ సందర్భంగా సూర దేవరాజు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో సంక్షేమ పథకాల అమలులో దేశంలో ఆదర్శంగా నిలిచిందని అన్నారు. ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు, రూ.500 లకే వంటగ్యాస్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు మహాలక్ష్మి పథకంతో ఉచితంగా ఆర్టిసి బస్సులో ప్రయాణం, మహిళా సంఘాలకు పావలా వడ్డీకి రుణాలు, రైతులకు ఋణ మాఫీ, పండించిన పంటలకు మద్దతు ధరతో పాటు 500 రూపాయల బోనస్ తదితర పథకాలతో దేశంలోని అగ్రగామిగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పరిపాలన సాగిస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు నూనె త్రివేణి, గుడిసెట్టి బాలరాజు, కత్తెరపాక ఎల్లయ్య, వార్డు అధ్యక్షులు నూనె శ్రీనివాస్, సద్దుల గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## సంభాజీనగర్‌లో అక్రమ అబార్షన్ కేంద్రం బట్టబయలు

### నలుగురు నిందితుల అరెస్ట్
### ఐదేళ్లుగా గుట్టుచప్పుడు కాకుండా దందా..
### నెలకు 15 గర్భస్రావాలు చేస్తున్న వైనం
### ఆడ పిండాలను కాలువలో పారేస్తున్న దారుణం
### ముఖ్య సూత్రధారితో పాటు నలుగురికి 7రోజుల పోలీస్ కస్టడీ

**ప్రజానావ, ముంబై:** మహారాష్ట్రలోని సంభాజీనగర్ పరిధిలో గల రషీద్‌పురా ప్రాంతంలో గత ఐదేళ్లుగా సాగుతున్న అక్రమ గర్భస్రావాల ముఠా గుట్టును పోలీసులు సోమవారం అర్ధరాత్రి రట్టు చేశారు. ఒక మహిళ అందించిన సమాచారం మేరకు అత్యంత రహస్యంగా దాడులు నిర్వహించిన పోలీసులు, ఈ అక్రమ కేంద్రాన్ని నిర్వహిస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. ప్రధాన నిందితురాలిగా గుర్తించిన షహేదా పర్వీన్ నేతృత్వంలో ఈ దందా కొనసాగుతున్నట్లు దర్యాప్తులో తేలింది. నిందితులను కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం వారికి ఏడు రోజుల పోలీస్ కస్టడీ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ దందాలో నిందితులు అత్యంత అమానవీయంగా వ్యవహరిస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. గ్రామీణ ప్రాంతాల నుంచి గర్భిణీలను ఇక్కడికి తీసుకువచ్చి, చట్టవిరుద్ధంగా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఆడ శిశువు అని తేలితే భారీగా నగదు వసూలు చేసి గర్భస్రావాలు చేస్తున్నారని, నెలకు సుమారు 12 నుంచి 15 వరకు అబార్షన్లు నిర్వహిస్తూ ఆ పిండాలను సమీపంలోని కాలువలో పడేస్తున్నారని పోలీసులు తెలిపారు. షహేదా పర్వీన్ ఎటువంటి వైద్య అర్హత లేకుండానే ఈ ప్రాణాంతకమైన గర్భస్రావాలు చేస్తూ మహిళల ప్రాణాలతో చెలగాటమాడుతోందని దర్యాప్తులో స్పష్టమైంది. ప్రస్తుతం అరెస్టయిన వారిపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసిన పోలీసులు, పరారీలో ఉన్న మరో నిందితుడి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ ముఠాతో ఇంకా ఎవరికైనా సంబంధాలు ఉన్నాయా? అనే కోణంలో విచారణ జరుపుతున్నారు. పట్టణ నడిబొడ్డున ఇంతకాలం పాటు ఈ అక్రమ కేంద్రం కొనసాగడం స్థానికంగా కలకలం రేపింది. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీస్ ఉన్నతాధికారులు స్పష్టం చేశారు.






## పరువు నష్టం దావా 2046కు వాయిదా

### బాంబే హైకోర్టు సంచలన నిర్ణయం
### 'అహంకార పోరాటాల'తో కోర్టుల సమయం వృథా
### 90 ఏళ్ల వాది ఉన్న కేసులో సామరస్య పరిష్కారానికి ఇరుపక్షాల నిరాకరణ
### సీనియర్ సిటిజన్ ప్రాధాన్యతను రద్దు చేస్తూ జస్టిస్ జితేంద్ర జైన్ ఉత్తర్వులు

**ప్రజానావ, ముంబై:** బాంబే హైకోర్టు ఒక పరువు నష్టం కేసును ఏకంగా 20 ఏళ్ల పాటు వాయిదా వేస్తూ అనూహ్యమైన నిర్ణయం తీసుకుంది. న్యాయవ్యవస్థపై పెరుగుతున్న కేసుల భారాన్ని దృష్టిలో ఉంచుకుని, వ్యక్తిగత ప్రతిష్టల కోసం సాగే 'అహంకార పోరాటాలు' కోర్టుల సమయాన్ని వృథా చేస్తున్నాయని ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ కేసులో వాది వయస్సు ప్రస్తుతం 90 ఏళ్లు అయినప్పటికీ, ఇరుపక్షాలు కోర్టు సూచించిన సామరస్య పరిష్కారాన్ని ఏకగ్రీవంగా తిరస్కరించడంతో న్యాయమూర్తి జస్టిస్ జితేంద్ర జైన్ ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారు. ఈ వివాదాన్ని సానుకూల వాతావరణంలో ముగించుకోవాలని కోర్టు చేసిన సూచనలను ఇరుపక్షాలు పట్టించుకోకపోవడంతో, ఈ కేసును 2046 తర్వాత మాత్రమే విచారించాలని కోర్టు స్పష్టం చేసింది. సాధారణంగా సీనియర్ సిటిజన్లకు ఉండే విచారణ ప్రాధాన్యతను కూడా ఈ కేసు విషయంలో రద్దు చేస్తున్నట్లు ఉత్తర్వులలో పేర్కొన్నారు. కేవలం పంతాలకు పోయి న్యాయవ్యవస్థపై భారం మోపేవారికి ఇదొక హెచ్చరికగా నిలవాలని ధర్మాసనం వ్యాఖ్యానించింది. న్యాయస్థానాలు తీవ్రమైన నేరాలు మరియు అత్యవసర సమస్యలపై దృష్టి సారించాల్సిన సమయంలో, ఇటువంటి పరువు నష్టం దావాలు ఏళ్ల తరబడి కొనసాగడం సమంజసం కాదని కోర్టు అభిప్రాయపడింది. సుమారు రెండు దశాబ్దాల పాటు ఈ కేసును పక్కన పెట్టడం ద్వారా న్యాయవ్యవస్థ విలువైన సమయాన్ని ఇతర ముఖ్యమైన కేసుల కోసం వినియోగించవచ్చని న్యాయమూర్తి తన ఉత్తర్వుల్లో వెల్లడించారు.

## కుంట్లూరులో కూల్చివేతల కలకలం

### గ్రేటెడ్ కమ్యూనిటీలో ఉద్రిక్తత

**ప్రజానావ, హయత్‌నగర్:** హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కుంట్లూరు ప్రజయ్ గుల్మహార్ గ్రేటెడ్ కమ్యూనిటీలో గురువారం ఉదయం తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కాలనీలో రోడ్డును కబ్జా చేశారంటూ కొందరు బాధితులు హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేయడంతో, ఆ అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు అధికారులు కూల్చివేత యంత్రాలతో రంగంలోకి దిగారు. అయితే కూల్చివేతలను వ్యతిరేకిస్తూ గ్రేటెడ్ కమ్యూనిటీ కాలనీవాసులు భారీ సంఖ్యలో గేటు వద్దకు చేరుకుని అధికారులను లోనికి రాకుండా అడ్డుకున్నారు. దీంతో అక్కడ భారీగా జనం గుమిగూడి నిరసన తెలపడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. రోడ్డు కబ్జా జరిగిందని ఫిర్యాదులు అందడం వల్లే తాము వచ్చామని, అక్రమ నిర్మాణాలను ఎలాగైనా కూల్చివేసి తీరుతామని హైడ్రా అధికారులు భీష్మించుకు కూర్చున్నారు. మరోవైపు కాలనీవాసులు అధికారుల వాహనాలను, యంత్రాలను అడ్డుకోవడంతో గత రెండు గంటల నుండి అక్కడ హైడ్రామా కొనసాగుతోంది. అధికారులకు, స్థానికులకు మధ్య వాగ్వాదం జరగడంతో తోపులాట చోటుచేసుకునే అవకాశం ఉన్నందున పోలీసులు భారీగా మోహరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా హయత్ నగర్ పోలీసులు అదనపు బలగాలను రప్పించారు. హైడ్రా సిబ్బంది తమ విధిని నిర్వహించేందుకు ప్రయత్నిస్తుండగా, కాలనీవాసులు మాత్రం ఆందోళనను విరమించే ప్రసక్తే లేదని స్పష్టం చేస్తున్నారు. అధికారుల మొండితనం, స్థానికుల పట్టుదలతో కుంట్లూరు ప్రాంతంలో ఉత్కంఠ నెలకొంది. చివరికి అధికారులు లోపలికి వెళ్లి కూల్చివేతలు చేపడతారా లేదా అన్నది వేచి చూడాల్సి ఉంది.

